క్లుప్తంగా

వాసవీమాత సేవలో కర్ణాటక భక్తులు


వాసవీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో కర్ణాటక నుంచి వచ్చిన 15 దంపతులు వాసవీ మాతకు పూజలు చేశారు. ఉదయం నుంచి 102 రుషీ గోత్ర మందిరంలో పంచలోహ వాసవీ మాతను దర్శించుకొని, మరకత శిల వాసవీమాతకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం యాగ శాలలో వాసవీ, శాంతి హోమాలు నిర్వహించారు. అర్చకులు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న పమ్మి లాజరు

యలమంచిలి: పేదలకు, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే నిజమైన దైవత్వం ఉందని దైవజనులు పి.ఎజ్రా అన్నారు. బూరుగుపల్లి గ్రామానికి చెందిన అగాపే చారిటబుల్ ట్రస్ట్ పదో వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం బాలలు, వితంతువులకు ఆయన ట్రస్ట్ తరపున దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ పమ్మి లాజరు, కార్యదర్శి పమ్మి తాతాజీ, కోశాధికారి పమ్మి లీలమ్మ, పాస్టర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

భీమవరం: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సోమవారం భీమవరంలోని బొండా రాంబాబు, లక్ష్మీరమణ దంపతులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్ఆర్ కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ పి సుబ్బారావు మాట్లాడుతూ బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని అన్నారు. శ్రీకృష్ణుని విగ్రహాలను ఏర్పాటుచేసి వాటికి సుమారు 60 రకాల వంటకాలు నైవేద్యంగా పెట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాయప్రోలు భగవాన్, కారుమూరి సత్యనారాయణ, పరుచూరి నాగేశ్వరరావు, కొండేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జార్జ్‌రాజుకు అవార్డు

ఉండి: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని సోమవారం విజయవాడలో మదర్స్ సర్వీసెస్ సొసైటీ సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బందెల జార్జ్‌రాజుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు, ఆయన భార్య ప్రమీలకు మదర్ థెరిస్సా అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఎన్‌జీవోస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ఎం ప్రసాదరావు చేతుల మీదుగా ఈ అవార్డులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. మత్తి రాజ్‌కుమార్, గొల్లా దానియేలు, రాపాక సామ్యూల్ తదితరులు జార్జ్‌రాజును అభినందించారు.

విద్యకు దూరం కావద్దు

భీమవరం: ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమవుతున్న ప్రతిభావంతులకు దాతలు సహకరించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కుమారులు 7, 3 తరగతులు చదువుతున్న ఎస్ కెన్నిత్, ఎస్ కొమల్ విద్యాఖర్చుల కోసం అపార్ట్‌మెంట్ వాసులు సమకూర్చిన రూ.25 వేలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. పేదల విద్య, వైద్య కోసం ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, చల్లా రావు, టీవీవీ ప్రసాద్, బంగార్రాజు, జవ్వాది శ్రీనివాస్, బాపిరాజు, కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గిడుగు రామమూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): గిడుగు రామమూర్తి తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం సంయుక్త అధ్వర్యంలో భీమేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, భాషోద్యమ నాయకులు గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు మహాకవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్యుల యువజన సంఘ నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, నాటక ప్రయోక్త, కళారంజని నాటక అకాడమి అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్, తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ ఉత్సవాలు నాలుగు రోజులపాటు విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించి విజేతలకు 29న బహుమతులు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్ నాయుడు, వారణాసి రాధాకృష్ణ, మెంటే పూర్ణ చంద్రరావు, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.



భద్రతపై దృష్టి సారించాలి



ఆసుపత్రుల్లో మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రాంతాల్లో భద్రతను పెంచాలి. పని చేసే సమయంలో సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలి. సహచర వైద్య సిబ్బంది ఎవరైనా ఆపదలో ఉంటే ఒకరినొకరు రక్షించేందుకు ముందుకు రావాలి. కోల్‌కత్తా ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో పీజీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడడం దేశాన్ని కదిలించివేసింది. ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తేనే నేరస్తులకు భయం ఉంటుంది.

– డాక్టర్ కొమ్మూరి రామకృష్ణ, నరసాపురం ఏరియా ఆసుపత్రి

కోల్‌కతా ఘటన అమానుషం



డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతుంది. కోల్‌కతాలో జరిగిన ఘటన అమానుషం. నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలి. మహిళా డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది రాత్రిపూట విధులు నిర్వర్తించే సమయంలో తప్పని సరిగా బందోబస్తు ఉండేలా ఏర్పాట్లు చేయాలి. ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం మత్తులో ఉండే వారిని, ఇతరులను అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలివ్వాలి.

– డాక్టర్ జాన్ హరిసన్, నరసాపురం ఏరియా ఆసుపత్రి

క్షీణిస్తున్న పారిశుద్ధ్యం.. జ్వరాల భయం

- డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టు
- ఎక్కడికక్కడ దర్శనమిస్తున్న చెత్తకుప్పలు
- పట్టించుకోని పాలకులు
- ఆందోళనలో ప్రజలు

నరసాపురం: నరసాపురంలో పారిశుద్ధ్యం దారుణంగా క్షీణిస్తోంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పురపాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పట్టణ వాసులకు అవస్థలు తప్పడంలేదు. ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సమస్య మొదటి నుంచీ ఉన్నా, దీనిని సరిచేసే ప్రయత్నం చేయడంలేదు. నరసాపురంలోని మొత్తం 31 వార్డుల్లో 60 వేల జనాభా ఉంది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది 150 మంది పారిశుధ్య నిర్వహణలో పని చేస్తున్నారు. అయితే కొన్ని రోజుల నుంచి చెత్తసేకరణ నుంచి, డ్రెయిన్స్ శుభ్రం చేయడం వరకూ ఏ పనులూ సవ్యంగా సాగడంలేదు. రుస్తుంబాద, రాయిపేట, వైఎస్సార్ నగర్, నందమూరి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కీలకమైన మార్కెట్ ప్రాంతం, స్టీమర్ రోడ్డు, కోర్టువీధి, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో కూడా పొంగుతున్న డ్రెయిన్లు, రోడ్డు పక్క చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

పందుల బెడద

పట్టణంలో ఇటీవల పందుల బెడద పెరిగింది. పందుల నిర్మూలనకు చర్యలు చేపడతామని మున్సిపల్ పాలకులు, అధికారులు ఎప్పటి నుంచో చెబుతాన్న ఆచరణకు నోచుకోవడంలేదు. పట్టణంలో రెండు శానిటరీ డివిజన్లు ఉన్నాయి. ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాత్రమే మొత్తం పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం చేయడంలేదు. రోడ్డు పక్క పెరిగిపోతున్న పిచ్చి మొక్కలను తొలగించే పరిస్థితి లేదు. ఫలితంగా దోమలు విపరీతంగా పెరిగి పట్టణ వాసులు రోగాల బారిన పడుతున్నారు. డ్రెయిన్స్ పరిస్థితి అయితే మరింత అధ్వానంగా తయారైంది.

జ్వరాల బారిన జనం

పాలకొల్లు అర్బన్: పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. జ్వరాలతో జనం బాధపడుతున్నారు. వర్షాలు కురవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. సిల్టు తీయకపోవడంతో డ్రెయిన్లలో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. రోడ్ల పక్కన చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పాలకొల్లు మండలంలోని భగ్గేశ్వరం, చింతపర్రు, లంకలకోడేరు శివారు, పూలపల్లి, వెదుళ్లపాలెం, గవరపేట, దగ్గులూరు, వెంకటాపురం తదితర గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉన్నాయి. భగ్గేశ్వరం దళితపేట ప్రధాన వీధిలో సిల్టుకు పేరుకుపోయి డ్రెయిన్‌లో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు దోమల నివారణకు కనీసం ముగ్గు, బ్లీచింగ్ చల్లడం లేదు. డ్రెయిన్‌లో మిలాథిన్ మందు పిచికారీ చేయడం లేదు. దీంతో ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. భగ్గేశ్వరం గ్రామానికి చెందిన ఒకరు డెంగీ జ్వరంతో పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం. పూలపల్లికి చెందిన ఆశ వర్కర్ భర్త విష జ్వరంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరినట్లు చెబుతున్నారు.

జ్వరాల బారిన ఆశ వర్కర్లు

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలువురు ఆశ వర్కర్లు జ్వరాల బారిన పడ్డారు. చింతపర్రు ఆశ వర్కర్లు సరోజిని, శిరోమణి, భగ్గేశ్వరం ఆశ వర్కర్ చింతపల్లి లక్ష్మి జ్వరాలతో బాధపడుతూ రక్తకణాలు పడిపోవడంతో పీహెచ్‌సీ వైద్యులు వైద్యం అందించడంతో కోలుకున్నారు. లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెంలో జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో విష జ్వరాలతో ప్రజలు తల్లడిల్లి పోతున్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ పరిధిలో గత మూడు రోజుల క్రితం నలుగురు మాత్రమే వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు నివేదించడం గమనార్హం.


నరసాపురం పొన్నపల్లిలో సిల్ట్ తీయకపోవడంతో పొంగుతున్న డ్రెయిన్


గోదావరిగట్టు మాధవాయిపాలెం వద్ద ఇళ్ల మధ్య నెలకొన్న దుర్గంధం


పాలకొల్లు అర్బన్ : భగ్గేశ్వరం దళితపేట ప్రధాన వీధిలోని డ్రెయిన్ దుస్థితి


పాలకొల్లు అర్బన్ : భగ్గేశ్వరంలో మురుగునీటిలో నడిచివెళుతున్న మహిళ

వారం రోజులు జ్వరంతో బాధపడ్డా



వారం రోజులు జ్వరంతో బాధపడ్డా. లంకలకోడేరులో పీహెచ్‌సీ వైద్యుడు ప్రతాప్‌కుమార్ సూచనల మేరకు వైద్య సేవలు పొందా. ప్రస్తుతం కోలుకున్నా. భగ్గేశ్వరం, చింతపర్రులో ఇంకా జ్వరంతో బాధపడుతున్నారు.

– చింతపల్లి లక్ష్మి, ఆశ వర్కర్, భగ్గేశ్వరం

రోగాల బారిన పడుతున్నారు



పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. డ్రెయిన్స్‌లో సిల్ట్ సవ్యంగా తీయలేదు. ఇళ్ల మధ్య డ్రెయిన్స్ పొంగుతున్నాయి. ఎంఎల్ ఆయిల్ చల్లడం, ఫాగింగ్ చేయడం వంటి పనులు మరిచిపోయారు. దీంతో విష జ్వరాలతో జనం బాధపడుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

– గోరు సత్తిబాబు, కృష్ణబాబు కాలనీ

పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టాలి



మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. సిబ్బందిని నియమించాలి. వర్షాలు పడుతున్నాయి. మరోపక్క పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దకపోతే ప్రజల ఆరోగ్యానికి మరింత నష్టం. మెయిన్ బజార్ సెంటర్‌లో కూడా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

– బర్రి శంకరం, పీచుపాలెం

పడకేసిన పారిశుద్ధ్యం

పెనుగొండ: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. సిబ్బంది కొరతతో కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారు. డ్రెయిన్లలో సిల్టు పేరుకుపోవడంతో నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దోమలు వృద్ధి చెంది జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. చెత్తాచెదారాలతో పలు గ్రామాల్లోని పంట కాలువలు మురుగు కుపాల్లా మారిపోతున్నాయి. ఆలమూరు ప్రాంతంలోనే 100 మందికి పైగా జ్వరాలతో బాధ పడుతున్నారు. ఇదే పరిస్థితి ఆచంట, పోడూరు, పెనుగొండ మండలాల్లోనూ నెలకొంది. పారిశుధ్య నిర్వహణాలోపం వల్లే జ్వరాల వ్యాపిస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. అధికారుల స్పందించి పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


పెనుగొండ: ఆచంటలో రోడ్డుపక్కనే డంప్‌చేసిన చెత్తా చెదారాలు


పెనుగొండ: ములపర్రు సీతారాముని చెరువులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


నరసాపురం : శివాలయం వద్ద ఉట్టి కొడుతున్న దృశ్యం


నరసాపురం రూరల్ : అలరించిన శ్రీకృష్ణుని నృత్యరూపకం


పాలకొల్లు అర్బన్ : శ్రీకృష్ణునికి ప్రత్యేక అలంకరణ

నరసాపురం / నరసాపురం రూరల్: నరసాపురం పట్టణం, మండలంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సారవ, మర్రితిప్ప తదితర గ్రామాల్లోని కృష్ణుని ఆలయాలతో పాటు పలు గ్రామాల్లోని వివిధ ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటుచేసిన ఉట్టిని కొట్టేందుకు యువతీ, యువకులు పోటీపడ్డారు. తెలగ కల్యాణ మండపంలో ఇస్కాన్‌సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శివాలయం వద్ద చాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పండుగలు మన సంస్కృతీ, సంప్రదాయలకు ప్రతీకలని వారు పేర్కొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామల్లో కృష్ణ యూత్ సభ్యులు కృష్ణ పరమాత్మున్ని ఊరేగించి ఉట్టి కొట్టారు. మొగల్తూరు పెద్ద గొల్లగూడెంలో ట్రాక్టర్‌పై కృష్ణున్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉట్టిని కొట్టి వెన్నను పంచారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కెనాల్‌రోడ్డులోని శ్రీకృష్ణా ఆలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుక నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న జమలయ్య

భీమవరం: వ్యవసాయ విద్యుత్ మోటర్స్‌కు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, 2022 విద్యుత్ బిల్లును కేంద్రం రద్దు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు తక్షణమే ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి సాయమందించాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల్లోపు రుణాలను మాఫీ చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్ కార్యకలాపాల నివేదికను సమర్పించారు.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పరామర్శ


సూరిబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఆచంట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చేకూరి సూరిబాబు కుటుంబాన్ని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. సూరిబాబు మాతృమూర్తి మృతి చెందడంతో ఆమె చిత్రపటం వద్ద సోమవారం పోడూరులో నివాళులర్పించారు. పరామర్శలో ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, నడపన గోవిందరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, రుద్రరాజు శివాజీరాజు, ఇందుకూరి సీతారామరాజు, సర్పంచ్ చిట్టిబత్తుల సువర్ణరాజు, పోతుమూడి రామచంద్రరావు, పిల్లి నాగన్న, కారువెల్లి జోగిరాజు, నెక్కంటి సతీష్, అంబటి సుధాకర్, గంట గిరిబాబు, తమ్మ నాగ మల్లేశ్వరరావు, పోడూరు సాయిబాబు, పోడూరు నాగరాజు, కందికట్ల వెంకట్రావు, రుద్రరాజు నరేంద్ర వర్మలు పాల్గొన్నారు.

మానవతతో వినూత్న సేవలు

పెనుగొండ: మానవత ఆధ్వర్యంలో సమాజానికి వినూత్న సేవలు అందిస్తున్నట్టు మానవత పెనుగొండ మండల శాఖ అధ్యక్షుడు నల్లిమిల్లి విజయరాజు అన్నారు. సోమవారం పెనుగొండలో మానవత మండల శాఖ సమావేశం నిర్వహించారు. మానవతకు పంచాయతీ కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మానవత డైరెక్టరు కొప్పిశెట్టి సూర్యనారాయణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యుడు కర్రినరేంద్ర రెడ్డి, పూర్వ కోశాధికారి బచ్చు లక్ష్మీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన ఎం.మోహన్‌బాబు, శ్రావణి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రకృతి సాగును పరిశీలించిన పంజాబ్ టీమ్


వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న పంజాబ్ టీమ్

పాలకొల్లు అర్బన్: ప్రకృతి సాగు ద్వారా రైతులు ఏ విధమైన లాభాలు ఆర్జిస్తున్నారో పంజాబ్‌కు చెందిన ఖేతి విరాసిత్ మిషన్ (కేవీఎం) బృందం పరిశీలించింది. బృందం సభ్యులు పాలకొల్లు మండలం అరట్లకట్ట, వాలమర్రు, కాపవరం గ్రామాల్లో ప్రకృతి సాగు విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. కాపవరంలో రైతు గుత్తుల రాము సమీకృత వ్యవసాయం ద్వారా చేస్తోన్న చేపలు, వరి, గట్లపై ఫల వృక్షాలు, ఆకుకూరలు, కాయగూరల సాగును పరిశీలించారు. సేంద్రియ ఎరువుల తయారీ, మహిళా సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమై ప్రకృతి సాగుపై ముఖాముఖీ చర్చించారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కోడిగుడ్డు, నిమ్మరసంతో తయారు చేసిన నీమాస్త్రం, ఆగ్నాస్త్రం గురించి పంజాబ్ టీమ్‌కి వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అరుణకుమారి, రాష్ట్ర, జిల్లా అధికారులు చంద్రబాను, వీరాస్వామి, అప్పారావు, మురళి, ఎంటీ నాగరాజు, పాలకొల్లు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.